క్లుప్తంగా

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



ఆర్మూర్‌టౌన్‌: మహిళలు ఆరోగ్య పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం అన్నారు. హౌసింగ్‌బోర్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వైద్యులు 126 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన వెంట వైద్యులు స్రవతి, మానస, సూపర్‌వైజర్‌ చంద్రశేఖర్‌, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

గోసంగి భవన నిర్మాణానికి భూమిపూజ



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆలూర్‌ మండలం మిర్ధాపల్లిలో గోసంగి సంఘ భవన నిర్మాణానికి ఉప సర్పంచ్‌ సొడ మధువర్మ మంగళవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భవన నిర్మాణానికి రూ.3 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ ఏఈ నితీశ్‌, ఎంపీటీసీ భూమన్న, గోసంగి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



బోధన్‌: ఎన్డీఎస్‌ఎల్‌ మూసివేత నాటి నుంచి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కార్మిక నాయకులు డిమాండ్‌ చేశారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ పట్టణంలోని షుగర్‌ ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 18వ రోజుకు చేరింది. దీక్షలు కార్మికులు రఘునాథ్‌, అన్వర్‌ మియా, నయీమొద్దీన్‌, శ్రీధర్‌, శ్రీను, బాలకృష్ణ, షేక్‌ మొహినొద్దీన్‌ పాల్గొన్నారు.

బోధన్‌లో వైద్య శిబిరం



బోధన్‌: పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో జిల్లా వైద్యశాఖ ఆయుష్‌ విభాగం ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యులు కాలనీవాసులకు సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు హైమవతి, విజయలక్ష్మి, కాలనీవాసులు సౌమ్య, శ్రీలత, మనోజ్ఞ, వనజ, దివ్య, సునీత, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలకు గురికావొద్దు



మోర్తాడ్‌: సురక్షితమైన డిజిటల్‌ బ్యాంకింగ్‌ పద్ధతులను ఉపయోగిస్తూ ఆర్థిక మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని మోర్తాడ్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పెద్దన్న సూచించారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌, కామర్స్‌ విభాగం, వైడ్స్‌ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక మోసాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైడ్స్‌ సంస్థ కౌన్సిలర్‌ నరేందర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ అసిఫుల్లా, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ అధికారి భూపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



మాక్లూర్‌: మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాలలో దంత వైద్యుడు శ్రీనునాయక్‌ మంగళవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రుద్రూర్‌కు స్పీకర్‌ రాక

రుద్రూర్‌: మండల కేంద్రంలో స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. కేజీబీవీ, మండల కాంప్లెక్స్‌, పలు కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించనున్నట్లు మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మంగళవారం తెలిపారు. కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- కంచె ఏర్పాటు చేయని ట్రాన్స్‌కో సిబ్బంది
- భయాందోళనలో ప్రజలు



కొత్తపల్లిలో పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌



కొత్తపల్లి ప్రవేశం వద్ద మూల మలుపుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌

బాల్కొండ: ముప్కాల్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో రోడ్డు పక్కనే రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌కో సిబ్బంది కంచె ఏర్పాటు చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులను వేడుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెల రోజుల క్రితం గ్రామంలో విద్యుత్‌ సమస్యపై వీడీసీ సభ్యులు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మూలమలుపు వద్ద..

ముప్కాల్‌ నుంచి కొత్తపల్లి వచ్చే రోడ్డు పక్కన మూల మలుపు వద్ద రోడ్డును ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ ఉంది. రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదవశాత్తు వాహనాలు అదుపు తప్పితే ట్రాన్స్‌ఫార్మర్‌కే ఢీకొంటాయి. అయినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించు కోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే రోడ్డు గుండా లక్ష్మి కాలువ డి–4 కాలువ పక్కన ఉన్న పాఠశాల భవనం వద్ద మరో ట్రాన్స్‌ఫార్మర్‌ ఉంది. కానీ కంచెలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు జరుకగ ముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లైన్‌మన్‌ నిర్లక్ష్యం..

స్థానిక లైన్‌మన్‌ నిర్లక్ష్యంతో హై–లోవోల్టేజీ సమస్యతో గ్రామంలో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. దీంతో వీడీసీ సభ్యులు లైన్‌మన్‌ మాకు వద్దంటు ఫిర్యాదు కూడా చేశారు. గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్య వేధిస్తునే ఉంది. ఇప్పటికైనా ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి వెంటనే కంచెలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే లో వోల్టేజీ, హైవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

త్వరలో కంచె ఏర్పాటు చేస్తాం

ట్రాన్స్‌ఫార్మర్లకు త్వరలోనే కంచెలు ఏర్పాటు చేస్తాం. ఇది వరకే విద్యుత్‌ తీగలు కిందకు ఉంటే మార్చి పైకి సెట్‌ చేశాం. కంచెలు ఏర్పాటు కోసం గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. ఉన్నత అధికారులు కూడా పర్యవేక్షించారు.

– రవి, ట్రాన్స్‌కో ఏఈ, ముప్కాల్‌ సెక్షన్‌

బోధన్‌లో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న పండరీపూర్‌ ఎమ్మెల్యే

నవీపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్‌ బీజేపీ అభ్యర్థి గెలుపుఖాయమని మహారాష్ట్ర పండరీపూర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే సమధాన్‌ మహదేవ్‌ ఔతాడే అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్‌ యోజన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మార్పు కోరుకుంటున్న నియోజకవర్గ ఓటర్లు బీజేపీకి ఓటు ఓసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మంత్రి రాజేంద్రకుమార్‌గౌడ్‌, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా బండారి రాజశేఖర్‌ను నియమించినట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. వీరికి పండరీపూర్‌ ఎమ్మెల్యే సమాధాన్‌ మహదేవ్‌ నియామకపత్రాలను అందజేశారు.

సంక్షిప్తం

కాంగ్రెస్‌ నాయకులతో వినయ్‌రెడ్డి భేటీ



డొంకేశ్వర్‌, నందిపేట(ఆర్మూర్‌): ఇటీవల బీజేపీ పార్టీకి రాజీనామా చేసిన వినయ్‌రెడ్డి కాంగ్రెస్‌ ఆర్మూర్‌, నందిపేట్‌ నాయకులతో భేటీ అయ్యారు. నాయకులతో పలు అంశాలపై చర్చించారు. ఈనెలాఖరులోగా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు నాయకులు తెలిపారు.

బాన్సువాడ కాంగ్రెస్‌ టికెట్‌కు సర్పంచ్‌ దరఖాస్తు



రుద్రూర్‌: బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ టికెట్‌ను ఆశిస్తూ మంగళవారం బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రుద్రూర్‌ సర్పంచ్‌ ఇందూర్‌ చంద్రశేఖర్‌ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట రాయకూర్‌ విండో వైస్‌ చైర్మన్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్‌, నాయకులు ఉన్నారు.

విద్యార్థుల హక్కుల కోసమే టీజీవీపీ

ఆర్మూర్‌టౌన్‌: టీజీవీపీ సంఘం ఏ రాజకీయ పార్టీ కాదని, కేవలం విద్యార్థుల హక్కుల కోసమే పోరాడుతుందని పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి కల్యాణ్‌ అన్నారు. పట్టణ కేంద్రంలో టీజీవీపీలో 15మంది విద్యార్థులు చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోహేల్‌, మహేశ్‌, సుజిత్‌, అదీబ్‌, రాజేశ్‌, ఇమ్రాన్‌, అయాన్‌, రంజిత్‌, సాయి, రాహుల్‌, రేవంత్‌, కిరణ్‌, మనోజ్‌, మనీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): కాంగ్రెస్‌ పార్టీ బీసీ సెల్‌ మండల అధ్యక్షుడిగా గణేశ్‌ గౌడ్‌ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్‌ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌ బీసీ సెల్‌ పట్టణ అధ్యక్షుడిగా రమణ



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌కు చెందిన దొండి రమణ కాంగ్రెస్‌ బీసీ సెల్‌ పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్‌ కమిటీ బీసీ సెల్‌ మండల అధ్యక్షులను మంగళవారం నియమించింది. తన నియామకానికి కృషి చేసిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చలో హైదరబాద్‌ను విజయవంతం చేయండి

పెర్కిట్‌(ఆర్మూర్‌): కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 29న చేపట్టే చలో హైదరబాద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు కోరారు. మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో చలో హైదరాబాద్‌ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సూర్య శివాజీ, ఎండీ ఖాజా మొయినుద్దీన్‌, భానుచందర్‌, మదర్‌, సదానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని బాలుర ఉన్నత, పెర్కిట్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఆర్మూర్‌ ఆధ్వర్యంలో వాలీబాల్‌, టెన్నికాయిట్‌ క్రీడా సామగ్రిని అందజేశారు. క్లబ్‌ అధ్యక్షుడు మోహన్‌దాస్‌, పెర్కిట్‌ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవి కుమార్‌, లయన్స్‌ క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



బోధన్‌: నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీవో రాజా గౌడ్‌ తెలిపారు. బోధన్‌లోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని సూచించారు. వచ్చే నెల సెప్టెంబర్‌ 19 వరకు ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్‌: విద్యార్థులు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం కానిస్టేబుల్‌ విఘ్నేశ్‌ అన్నారు. పట్టణంలోని రాంమందిర్‌, నవనాథపురం ప్రాథమిక పాఠశాలలో షీటీం సిబ్బంది సైబర్‌ క్రైంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోన్లలో వచ్చే లింక్‌లను ఓపెన్‌ చేయొద్దని సూచించారు. మహిళలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్‌ 100కు సమాచారం అందించాలన్నా రు. అనంతరం షీటీం కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం చలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేత



నవీపేట: నూతనంగా నిర్మించిన బినోల సొసైటీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ చైర్మన్‌ మగ్గారి హన్మాండ్లు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రికను హైదరాబాద్‌లో మంగళవారం అందజేశారు. ప్రారంభోత్సవానికి వస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు చైర్మన్‌ తెలిపారు.

బొంకన్‌పల్లి సర్పంచ్‌ రాజీనామా

మాక్లూర్‌: మండలంలోని బొంకన్‌పల్లి సర్పంచ్‌ తోట పద్మ సర్పంచ్‌ పదవీకి రాజీనామా చేశారు. ఉప సర్పంచ్‌గా ఉన్న సాయమ్మను ఇన్‌చార్జి సర్పంచ్‌గా డీపీవో జయసుధ మంగళవారం నియమించారు. సర్పంచ్‌ పద్మకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చినందున రాజీనామా చేశారు. ప్రస్తుతం మండలంలో బొంకన్‌పల్లి, సట్లాపూర్‌ తండా పంచాయతీలు ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతున్నాయి. సట్లాపూర్‌తండా సర్పంచ్‌ మీనాబాయి బాధ్యతలు చేపట్టిన 16 నెలలకే అనారోగ్యంతో మృతి చెందగా ఉప సర్పంచ్‌గా ఉన్న గంగాధర్‌కు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఘన స్వాగతం



కమ్మర్‌పల్లి/ వేల్పూర్‌: ప్రశాంత్‌రెడ్డికి బాల్కొండ నుంచి మూడోసారి పార్టీ టికెట్‌ ప్రకటించిన తర్వాత తొలిసారిగా కమ్మర్‌పల్లికి రావడంతో పార్టీ శ్రేణులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మంగళవారం ఘన స్వాగతం పలికారు. పెర్కిట్‌ నుంచి వాహనాలతో భారీ ర్యాలీగా వేల్పూర్‌, భీమ్‌గల్‌ మీదుగా కమ్మర్‌పల్లికి చేరుకున్న ప్రశాంత్‌రెడ్డికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. వేల్పూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద ఆయన తండ్రి దివంగత సురేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముప్కాల్‌ తహసీల్దార్‌గా వనజారాణి

బాల్కొండ: ముప్కాల్‌ మండల తహసీల్దార్‌గా వనజారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఆమె ఉద్యోగోన్నతిపై ముప్కాల్‌కు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు సిబ్బంది సన్మానించారు.

మాక్లూర్‌ తహసీల్దార్‌గా మహ్మద్‌ షబ్బీర్‌

మాక్లూర్‌: మాక్లూర్‌ తహసీల్దార్‌గా మహ్మద్‌ షబ్బీర్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పనిచేసిన తహసీల్దార్‌ శంకర్‌ ఉద్యోగోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ కాగా నిర్మల్‌ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న షబ్బీర్‌ ఉద్యోగోన్నతిపై మాక్లూర్‌కు వచ్చారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తహసీల్దార్‌ అన్నారు.

డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ కోసం కృషిచేయాలి



మోర్తాడ్‌: రాబోయే ఎన్నికల్లో బీజేపీ డబుల్‌ ఇంజిన్‌ సర్కార్‌ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కర్ణాటక రాష్ట్రం నిప్పని నియోజకవర్గ ఎమ్మెల్యే శశికళ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో శశికళ పర్యటించారు. కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెను పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్‌ మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మిర్యాల్‌ సర్పంచ్‌ సోమ పెద్దరాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి



విజేతలకు డిక్షనరీలు అందజేస్తున్న వైద్యులు

రెంజల్‌(బోధన్‌): విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డివిజనల్‌ సబ్‌ యూనిట్‌ అధికారి వెంకటేశ్వర్‌రావు, మండల వైద్యాధికారి వినయ్‌కుమార్‌ అన్నారు. రెంజల్‌ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం దోమలతో వచ్చే వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి చింతల శ్రావణ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్‌ రెడ్డి

పెర్కిట్‌(ఆర్మూర్‌): నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీని పటిష్ఠపర్చాలని మహారాష్ట వని ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి బాపురావు అన్నారు. ఆర్మూర్‌ మండలం పిప్రిలో నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్‌ యోజన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి అరాచక పాలనను అంతమొందించడానికి పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ఆదిలాబాద్‌ ఇన్‌చార్జి అల్జాపూర్‌ శ్రీనివాస్‌, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్‌ మధుశేఖర్‌కు సన్మానం



డాక్టర్‌ మధుశేఖర్‌ను సన్మానిస్తున్న వేల్పూర్‌ పాస్టర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

వేల్పూర్‌/ఆర్మూర్‌/పెర్కిట్‌: ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్‌ మధుశేఖర్‌ను మండల పాస్టర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు ఆర్మూర్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్‌ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు సీయోనుకుమార్‌, ఉపాధ్యక్షుడు పాస్టర్‌ మాణిక్యం, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో డాక్టర్‌ మధుశేఖర్‌ను దళిత సంఘాల ప్రతినిధులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ చైర్మన్‌గా మధుశేఖర్‌ నియామకం కావడం అభినందనీయమని అన్నారు. నాయకులు జంగం అశోక్‌, కోటేశ్వర్‌, గుమ్మడి చంద్రయ్య, కుమార స్వామి పాల్గొన్నారు.

ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్‌ మధుశేఖర్‌ను ఎంజే దవాఖానలో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ ఆర్మూర్‌ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు పట్వారీ గోపీకృష్ణ, పట్వారీ తులసికుమార్‌, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్లలో సీఎం కేసీఆర్‌, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్ర పటాలకు బీఆర్‌ఎస్‌ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రికి నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, సర్పంచ్‌ ఆకుల రాజేశ్వర్‌, ఉప సర్పంచ్‌ మగ్గి మోహన్‌, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ‘బాల్కొండ’కు ప్రాధాన్యం

మోర్తాడ్‌(బాల్కొండ): బాల్కొండ నియోజకవర్గానికి మరోసారి ప్రాధాన్యత దక్కింది. బీఆర్‌ఎస్‌ అధినేత, సీఎం కేసీఆర్‌ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో నియోజకవర్గానికి రెండు టిక్కెట్లు లభించాయి. వేల్పూర్‌ మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌రెడ్డికి బాల్కొండ అభ్యర్థిగా మూడోసారి అవకాశం కల్పించిన విషయం విధితమే. ఇదే మండలంలోని జాన్కంపేట్‌కు చెందిన ఆశన్నగారి జీవన్‌రెడ్డికి కూడా ఆర్మూర్‌ నియోజకవర్గం నుంచి మూడోసారి అవకాశం దక్కింది. రెండు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు నేతలది ఒకే మండలం అందునా బాల్కొండ నియోజకవర్గం కావడం విశేషం.

ఘనంగా జంటనాగ ప్రతిష్ఠాపన



వర్ని, (మోస్రా): మోస్రా మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో జంట నాగ ప్రతిష్ఠాపన, సుదర్శన పెరుమాళ్ల ఉత్సవ విగ్రహ స్థాపన కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం చేపట్టారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు ఉగ్ర నర్సాగౌడ్‌, శ్రీనివాస్‌ దంపతులు, ఆలయ అర్చకులు శ్రీనివాస్‌, నవీన్‌, విజయ్‌ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

మోపాల్‌: మండలంలోని చిన్నాపూర్‌ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను మంగళవారం సీఐ వెంకట్‌నారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుంటే నేరాలు అదుపు చేయవచ్చని పేర్కొన్నారు. ఎస్సై రాము, సర్పంచ్‌ లహసీయమోహన్‌, వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి



భీమ్‌గల్‌: మున్సిపల్‌ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించి, వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు వారు మంగళవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కార్మికుల బకాయిలు చెల్లించి పీఎఫ్‌, ఈఎస్‌ఐ జమ చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌ బాబు, నాయకులు, కార్మికులు ఉన్నారు.

సినిమాలు — తెలుగు/హిందీ/ఇంగ్లీష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌(ఆర్మూర్‌)

స్క్రీన్‌-1 –	బ్లూ బీటల్‌-10.10 7.20
	పిజ్జా–3 ది మమ్మీ (తెలుగు) -1.00
	భోళా శంకర్‌ -4.00
	గదర్‌-2 (హిందీ) -10.10
స్క్రీన్‌-2 –	జైలర్‌ (తెలుగు) -11.45, 3.10, 6.35 10.00
స్క్రీన్‌-3 –	డీడీ రిటర్న్స్‌ (తెలుగు) -11.50
	గదర్‌-2 (హిందీ) -2.35, 6.10
	భోళా శంకర్‌ (తెలుగు) - 9.45
స్క్రీన్‌-4 –	గాంధీ (తెలుగు) - 10.00
	రఘువరన్‌ బీటెక్‌ - 1.20
	ప్రేమ్‌ కుమార్‌ (తెలుగు) -4.10
	మిస్టర్‌ (తెలుగు) - 7.20
	డీడీ రిటర్న్స్‌ (తెలుగు) -10.20